# నేల మీది నక్షత్రాలు

కొండవాగు బండరాళ్ళ మీదుగా పొర్లి, కిందనున్న యిసుకలో సెలయేరుగా మారి గలగలా నవ్వుతోంది. రోజల్లా కాసిన ఎండ ఎర్రగా మారి, ఆహ్లాదకరంగా ఉంది. ముడుచుకుపోయిన సుగంధ రాజనాలు విప్పారి, సువాసనల్ని వెదజల్లుతున్నాయి. కాని రాజారావు గుండెలో పార్వతి మీది ద్వేషం అలానే ఉండిపోయింది.

బొమ్మలు విరిగితే ఏడవకూడదని పిల్లలకు పాఠాలు చెప్పే రాజారావు, కలలు చెదిరి మౌనంగా ఏడ్చాడు. ఆశా సౌధాల్లో విహరించడం వెర్రితనమని భావించే రాజారావు, పునాదుల్లేని ప్రేమ సౌధం పేకమేడలా కూలినందుకు మనస్సు ముక్కలై మరీ ఏడ్చాడు. ఏడ్చి ఏడ్చి గూడు కట్టుకొన్న బాధని ద్వేషంగా మార్చుకొని, వెన్నలాంటి మనసుని రాతి మనసుగా మార్చుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

పార్వతి తలపుల్లో తనకింతచోటూ, సదభిప్రాయమూ ఉన్నాయని నిర్ధారణ చేసుకొన్న రోజున, "మనసులో మీ మీది మమతలు కలలుగా రూపొందించుకొంటూ, మూడు నెలలుగా స్వాప్నిక జగత్తులో ఉంటూ ఉండి వచ్చాను. మీ కభ్యంతరం లేకపోతే మిమ్మల్ని మళ్ళీ సుమంగళిగా చేసే అదృష్టం నాకిస్తారనుకొంటాను" అని స్కూలు వరండాలో రాజారావు, ఆమెని అడిగాడు. పార్వతి చివ్వున కళ్ళెత్తి రాజారావు కళ్ళలోకి చూసింది. నీళ్ళ తెరలు కమ్మిన పార్వతి కళ్ళలో తన బొమ్మను చూసుకొంటూ మౌనంగా నిలబడిపోయాడు. పార్వతి తల వంచుకొని నెమ్మదిగా అంది.

"నాకు, ఆరేళ్ళ కొడుకున్నాడన్న సంగతి మీరు మరిచిపోయారనుకొంటాను!"

"అన్నీ ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. మీ అంగీకారం కోసం ఎదురు చూస్తుంటాను"

"అత్యాశకు పోవడమోమోనని ఆలోచిస్తున్నాను. పసివాడి మనసు బాధపడ్తుందన్న భయంతో, మళ్ళీ వైవాహిక జీవితంలో అడుగు పెట్టడానికి ధైర్యం చాలటం లేదు. నా మీది జాలి కొద్దీ మీరీ నిర్ణయానికి రావడం నా కిష్టం లేదు. కాదు, ప్రేమంటారూ, అదృష్ట వంతురాల్ని. అయినా ఆలోచించడానికి కొంచెం వ్యవధి కావాలి"

ఆ మాటలకే రాజారావు పొంగిపోయాడు. పార్వతి కొడుకుని చేరదీసి సన్నిహితుడైపోయాడు. తన కొడుకు భవిష్యత్‌కు భయం లేదని నిశ్చయించుకొన్న పార్వతి, అదే సెలయేటి ఒడ్డున రాజారావు చేతిలో చేయి వేసిన రోజున, మీద పడ్తోన్న రుద్రగన్నేరు పువ్వుల్నీ, గలగలా పారుతున్న సెలయేటినీ, కొండల్నీ ఆక్రమిస్తున్న పొగ మంచునీ - ఇంకా పరిసరాల్నీ, ప్రకృతినీ, అన్నిటినీ మరిచిపోయి, పార్వతి చేతిని ముద్దు పెట్టుకొన్న మధురానుభూతి కలగానే మిగిలిపోయింది రాజారావుకి.

"త్వరపడి ఆ రోజు నిర్ణయానికి వచ్చినందుకు విచారిస్తున్నాను. మన ఈ వివాహం జరగడానికి అవకాశం లేదు. బ్రతుకుబాటలో మనం ఒకరి కష్టసుఖాలు మరొకరు పంచుకొనే బదులు, బడి పిల్లల భవిష్యత్తుకు మార్గం చూసే సహ ఉద్యోగులుగా

ఉండడమే మేలనుకొంటున్నాను'' అని చిన్న చీటీ ముక్కలో, పార్వతి రాజారావుని కలలోంచి వాస్తవంలోకి గిరాటు వేసింది. కారణాలు అడిగి అలసిపోయిన రాజారావు, కొంత బాధపడి, ఆ బాధలోంచి నెమ్మదిగా తేరుకొన్నాడు.

అయితే కారణం తెలిసిన రోజున తగిలిన విఘాతానికి తట్టుకోలేక పోయాడు. మెడలో తాళి కట్టి తిరిగి సుమంగళిగా చెయ్యడానికి సిద్ధపడ్డ తనని మొదట అంగీకరించి, తర్వాత నిరాకరించిన పార్వతి, ఆ స్కూలు అధికార వర్గంలోని సోమశేఖరానికి ఉంపుడుగత్తెగా మారినందుకు, రాజారావు హృదయంలో కొండవాగులు పొంగాయి. లోకంలో ఉన్న ఎండంతా గుండెల్లోనే కాసింది.

కసి కొద్దీ చేతికందిన రాయి తీసి, నీళ్ళలో విసిరేశాడు.

"నా మీది కోపమంతా ఆ రాయి మీద చూపిస్తున్నారనుకొంటాను!"

వెనక నుంచి వినవచ్చిన మాటలతో రాజారావు తల తిప్పి చూశాడు. పెదాల మీద చిరునవ్వుతో పార్వతి నిలబడి ఉంది.

"ఆకాశంలో ఉన్న తారవి. నీళ్ళలోని నీడవి. ఎన్ని రాళ్ళు వేస్తే తగిలినట్లు?" రాజారావు నీళ్ళలోకి చూస్తూ అన్నాడు.

"పైనున్న చుక్కని కాను, నేల మీది నక్షత్రాన్నే. నీళ్ళలో నీడని కాను. ఒడ్డునున్న మనిషిని. నన్ను రాళ్ళతో కొట్టడం అనవసరం. మీరన్న ప్రతి మాటా నాకు తగుల్తూనే ఉంది!" పార్వతి పెదాల మీద అదే చిరునవ్వు. వెనుక అణగారిన హిమాలయాల్లాంటి మనోవేదన రాజారావుకి తెలియదు.

'నేల మీద నక్షత్రానివి కాదు, నేల రాలిన చుక్కవి! ఒక రాత్రికి ఎంత తీసుకొంటావు?' యిళ్లని నిలబెట్టి మనుషులను నాశనంచేసే న్యూట్రాన్ బాంబులా, మనిషిని నిలబెట్టి మనసును దహించే ప్రశ్న అడిగాడు.

"నేల రాలిన చుక్కనయినా, నన్నందుకొనే తాహతు మీకు లేదు. అది బలవంతులకీ, ధనవంతులకీ చెల్లుతుంది కానీ, బడిపంతులిక్కాదు!"- సమాధానం యిచ్చి, 'పతనమైన దాన్ని, మీరే నా కందని చందమామగా ఉండిపోయారు!' అని మనసులో అనుకొంటూ, పార్వతి గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది.

పార్వతి మనసులో మాటలు రాజారావుకి వినబడలేదు. వినబడ్డ మాటలు రాజారావు ఆలోచనలో చోటు చేసుకొన్నాయి.

కొండల మాటున అస్తమించిన సూర్యుడి వెనుకనే చీకటి పరుగెత్తుకొంటూ వచ్చింది. ఆ చీకటిలో రాజారావుకి వెలుగు బాట కనిపించింది. అప్పుడప్పుడూ జీతాలందుకొనే తనలాంటి బడిపంతులు - అందని వాటిని చూస్తూ ఆనందించాలే కాని, పొందటానికి ప్రయత్నించకూడాదు! ప్రేమంటే ఏమిటో చదివి తెలుసుకోవాలే కాని, ప్రేమించకూడదు!

పిండారబోసిన వెన్నెల్లో సెలయేరు వెండి నురగల్ని వెదజల్లుకొంటూ, గలగలా పారుతోంది. రాజారావు మనసు హాయిగా నవ్వింది. ●

('యువ' మాసపత్రిక)